క్లుప్తంగా

సంతలో అన్నదానం



నవాబుపేట: మండల కేంద్రంలో ఆదివారం సంతకు వచ్చేవారికి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహాచారి ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం కొనసాగుతోంది. గత 20వారాలుగా నిరంతరంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. మారుమూల గ్రామాలకు సరైన రవాణా సౌకర్యం లేకపోవటంతో నవాబుపేటకు సంతకు ఆదివారం ఉదయమే ప్రజలు వస్తారు. అలాంటి వారి కోసం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంపై ప్రజలు హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో వ్యాపార సంఘం మండలాధ్యక్షుడు సుధాకర్‌చారి, నవాబుపేట డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు పుట్టి ఆంజనేయులు, రఘువీర్‌శర్మ, నిరంజన్, రఘు, చందు, వెంకటయ్య పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రాజాపూర్(బాలానగర్): మండలంలోని పెద్దరేవల్లి గ్రామంలో ఆదివారం సీసీ రోడ్డు, అండర్ డ్రెయినేజీ పనులకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు నవీన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి అన్నివిధాలుగా అభివృద్ధికి పాటుపడుతున్నట్లు తెలిపారు. రూ.150 కోట్లతో యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కోసం శంకుస్థాపన చేసుకున్నామన్నారు. పెద్దరేవల్లి, గంగాపూర్ గ్రామాల డబుల్ రోడ్డు పనులు చకచకా జరుగుతున్నాయని అన్నారు.

కాజ్‌వే నిర్మించాలి



భూత్పూర్: మండలంలోని కర్వెన సమీపంలోని కాల్వపై కాజ్‌వే నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కర్వెన వాసులు వివిధ పనుల నిమిత్తం మంగనూరు, బిజ్నాపలి, నాగర్‌కర్నూల్ వెళ్లాలంటే ఈ కాల్వ దాటి వెళ్లాలి. చౌలతండా వాసులు కర్వెనకి పనుల నిమిత్తం వెళ్లాలంటే వర్షాకాలంలో కాల్వ ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోతాయి. చౌలతండా స్టేజి నుంచి కర్వెనకి రూ.2.20కోట్లు ఎస్టీ ప్రత్యేక నిధులు మంజూరై ఏడాది పూర్తయిన పనులు చేపట్టకపోవడంతో కర్వెన, చౌలతండా వాసులు ధర్నా సైతం చేపట్టారు. ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని బీటీ రోడ్డు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. .

అర్హులందరికీ రేషన్ కార్డులు



మిడ్జిల్: అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇస్తామని మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రైతుభరోసా, రేషన్‌కార్డులు సర్వేలో భాగంగా అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి, తహసీల్దార్ రాజు, నాయకులు గౌస్, వెంకటయ్య, అల్వాల్‌రెడ్డి, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి చెంత భక్తుల రద్దీ



నవాబుపేట: మండలంలో ప్రసిద్ధి చెందిన పర్వాతాపూర్ మైసమ్మ దేవాలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం దేవాలయంలో మొక్కులు తీర్చుకున్నారు. దీంతో అడవి మొత్తం భక్తులతో నిండిపోయింది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

కాసుల పంట



నవాబుపేట సహకార సంఘం కార్యాలయం

- రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడులు
- మహిళా, సహకార సంఘాలకు లాభాలు
- అరకోటికి పైగా కమీషన్లు

నవాబుపేట: వరి ధాన్యం ఇటు రైతులకు.. అటు సహకార, మహిళా సంఘాలకు కాసుల పంట కురిపిస్తోంది. రెండేళ్లుగా వరి పంట చాలా పెద్ద ఎత్తున దిగుబడి రావటంతో మండలంలో 19 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రభుత్వం ఏర్పాటుచేసింది. వాటిలో 5.96లక్షల బస్తాల ధాన్యం కొనుగోలు చేశారు. వీటికిగానూ మహిళా, సహకార సంఘాలకు దాదాపు రూ.64లక్షలకు కమీషన్ అందనుంది. అటు రైతులకు గిటుబాటు ధర అందించి ఇటు మహిళా, సహకార సంఘాలు పెద్ద ఎత్తున లాభాలు అర్జించటం విశేషం.

ఆరు కొనుగోలు కేంద్రాలు..

ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం ద్వారా మండలంలో ఆరు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో దాదాపుగా 3లక్షల బస్తాలకు పైగా వరిధాన్యం కొనుగోలు చేశారు. వీటికి రెండేళ్లలో రూ.44లక్షలు కమీషన్ రూపంలో వచ్చింది. కాగా రూ.10లక్షలు విడుదల కాగా మరో రూ.30లక్షలకు పైగా కమీషన్ రావాల్సి ఉంది.

రైతులకు అండగా కొనుగోలు కేంద్రాలు



తాజాగా ప్రభుత్వం తీసుకు వచ్చిన కొనుగోలు కేంద్రాలు రైతులకు అండగా ఉన్నాయి. గతంలో వ్యాపారులను ఆశ్రయిస్తే చాలా తక్కువగా ధర వచ్చేది. దీంతో పంట ఎంత పండినా లాభం లేకుండా పోయేది. కొనుగోలు కేంద్రాల ద్వారా గిట్టుబాటు ధరతో పాటు బోనస్ ఇస్తున్నారు. రైతులకు పంటల దిగుబడికి తగ్గట్టు ధరలు రావటం సంతోషకరం.

– బాల్‌రాజ్, రైతు, గురుకుంట

సహకార సంఘానికి ఆదాయం



రైతులకు గిట్టుబాటు ధర అందించి వారికి మేలు చేయటంతో పాటు సహకారం సంఘానికి ఆదాయం తీసుకువచ్చాం. దీన్ని దృష్టిలో ఉంచుకుని మండలంలోని చాలా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశాం. ధాన్యం ఎక్కువగా పండిన గ్రామాలను క్లస్టర్లుగా చేసి రెండు మూడు గ్రామాలకు ఒక కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. దీంతో రైతులకు రవాణా సైతం సులువైంది. ఒకప్పుడు అప్పుల్లో ఉన్న సంఘానికి ధాన్యం కొనుగోళ్ల ద్వారా రెండేళ్లలో దాదాపుగా అరకోటికి పైగా కమీషన్ వచ్చింది. అప్పుల నుంచి బయటపడింది.

– నర్సింహులు, చైర్మన్, సహకార సంఘం, నవాబుపేట

‘స్థానిక’ ఎన్నికల్లో సత్తా చాటాలి

- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

దేవరకద్ర రూరల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం కొౌకుంట్ల మండలంలోని వెంకటగిరిలో పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆల మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేయలేదన్నారు. స్థానిక ఎన్నికల్లో మరోసారి ఆపార్టీ ప్రజలను మోసం చేయడానికి సిద్ధమైందని, ప్రజలే బుద్ధిచెప్పాలని అన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

అనంతరం గ్రామంలో శ్యామలమ్మ దశదిశకర్మకు హాజరై బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం

- టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం కృషిచేస్తోందని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఆయన ఆల్‌మేవా జిల్లాశాఖ నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్, కార్యదర్శి డాక్టర్ షేక్ ఫరీద్, ప్రధాన కార్యదర్శి వహీద్‌షా, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ అయూబ్, అబ్దుల్ ఖాదర్, సంఘ నాయకులు అబ్దుల్ ఖలీల్, ఖాజా జైనుల్లా అబెదిన్, సిరాజ్‌ఖాన్, ఖాజా నిజాముద్దీన్,ఎండి.ఖాదర్, యూసుఫ్ బిన్ నాసర్, రియాజ్, ఎండి.ఆరిఫ్, ఎండి.ఖాజ, రజాక్, ఎండి.ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కొత్వాల్ తదితరులు

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి



మేధావుల, ప్రజా, కుల సంఘాల సంఘీభావం

మహబూబ్‌నగర్ రూరల్: సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను త్వరగా అమలు చేయాలని ప్రజా, కుల సంఘాల మేధావులు అభిప్రాయపడ్డారు. ఆదివారం స్థానిక టీఎన్జీఓ భవన్‌లో మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ అమలు కోసం మేధావుల సంఘీభావ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ నాయకుడు నారాయణగౌడ్, టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ ఖలీల్, వెంకటేశ్వర్‌రావు, రజక సేవా సమితి నాయకుడు పురుషోత్తం, నాయీబ్రాహ్మణ సంఘం నాయకుడు శేఖర్‌ఎస్సీ వర్గీకరణ అమలుపై తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. నాయకులు చెన్నకేశవులు, చంద్రశేఖర్, డాక్టర్ రమేష్, గాలి యాదయ్య, సువార్తమ్మ, నాసరయ్య, కావలి కృష్ణయ్య, పుట్టుపాగ రఘుపతి, ప్రభాకర్, కొండయ్య, రాములు, నర్సిములు, మల్లేష్, రామస్వామి, బోయపల్లి ఆంజనేయులు, కృష్ణయ్య పాల్గొన్నారు.

తీరనున్న విద్యుత్ సమస్య

- 160కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు వెంకటేశ్వరకాలనీ ఫేస్–2లో ఆదివారం 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 160కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయటంతో సమస్య తీరనున్నది. క్రేన్‌సహాయంతో పాత ట్రాన్స్‌ఫార్మర్ తొలగించి కొత్తది అమర్చారు. కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్ అధికంగా పడి లోటల్టేజి సమస్యతో తరచూ ఫీజులు ఎగిరిపోవటం వంటి సమస్యలను కాలనీవాసులు ఎదుర్కొన్నారు. దీంతో వార్డు కౌన్సిలర్ సతీష్ స్పందించి విద్యుత్ అధికారులతో మాట్లాడి ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చారు. కార్యక్రమంలో ఏఈ ఎర్రన్న ఉన్నారు.



క్రేన్ సహాయంతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేస్తున్న విద్యుత్ సిబ్బంది

బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఆర్‌ఆర్‌బీ, ఎస్సెస్సీ, బ్యాంకింగ్ ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు బీసీ సంక్షేమశాఖ అధికారిణి ఇందిరా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 9వతేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, తరగతులకు హాజరైన వారికి నెలకు రూ.1500 స్టైఫండ్‌ను ఇవ్వనున్నామన్నారు. రిజర్వేషన్, డిగ్రీ మార్కుల ఆధారంగా ఎంపికలు ఉంటాయని తెలిపారు.

ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని డిమాండ్

మహబూబ్‌నగర్ రూరల్: లంబాడీ సమాజంలో ఉపాతెగా అయిన డాడీ లంబాడీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని డాడీ లంబాడీ హక్కుల సాధన సమితి (డీఎల్‌హెచ్‌ఎస్ఎస్) జిల్లా అధ్యక్షుడు రాజునాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఆసమితి ఆధ్వర్యంలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 15న సేవాలాల్ జయంతిని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని అన్నారు. ఆసమితి రాష్ట్ర ఆఫీస్ కార్యదర్శి సంజునాయక్, కోశాధికారి రూప్‌సింగ్‌నాయక్, రమేష్‌నాయక్, శ్రీనునాయక్, నాగేష్‌నాయక్ పాల్గొన్నారు.

కేబుల్ వైర్లు చోరీ

మిడ్జిల్: మండలంలోని మున్ననూర్, వాడ్యాల్ గ్రామ సమీపంలోని కేఎల్ఐ కాల్వకు రైతులు అమర్చిన దాదాపు 60 మోటార్ల కేబుల్‌వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీచేసినట్లు రైతులు తెలిపారు. శనివారం అర్ధరాత్రి ముగ్గురు వ్యక్తులు మోటార్‌సైకిల్‌పై వచ్చి కేబుల్‌వైర్లు కట్ చేస్తుండగా వాడ్యాల్ సమీపంలో రైతులు చూశారు. మోటార్‌సైకిల్, కేబుల్ వదిలివెళ్లగా రైతులు బైక్‌ను పోలీసులకు అప్పగించగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. ఇటీవల అయ్యవారిపల్లి, కొత్తూర్ సమీపంలో కేబుల్‌వైర్లు చోరీకి గురయ్యాయన్నారు.ఒక్కమోటారుకు ఐదు వేల వరకు కేబుల్ ఖర్చు వస్తుందన్నారు.

దివిటిపల్లిని అభివృద్ధి చేసుకుందాం



స్టేషన్ మహబూబ్‌నగర్: పార్టీలకతీతంగా దివిటిపల్లిని అభివృద్ధి చేసుకుందామని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దివిటిపల్లి డబుల్ బెడ్ రూం ఇళ్లలో ఏర్పాటుచేసిన ముగ్గుల పోటీల్లో గెలిచిన వారికి ఆదివారం రాత్రి చైర్మన్ బహుమతులు అందజేశారు. ఈప్రాంతంలో చిన్నారుల కోసం పాఠశాల ఏర్పాటుకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో చర్చిస్తామన్నారు. హనుమాన్ ఆలయం వద్ద హైమాస్ట్‌లైట్లను ప్రారంభించారు. శివశంకర్, చెన్నయ్య, ఆంజనేయులు, శివప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, రవిశంకర్, రఘు, మురళీ పాల్గొన్నారు.





ఇదేమైనా పార్కింగ్ స్థలమా

ప్రజా రవాణా వ్యవస్థను మెరుగు పరిచే దిశగా ప్రభుత్వాలు ఫ్లైఓవర్లను నిర్మించింది. ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ప్రజలు వాహనాలను అడ్డదిడ్డంగా నిలుపుతూ పార్కింగ్ స్థలంలా మార్చేశారు. దీంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, వ్యాపారులు ప్రతి రోజు శంషాబాద్, హైదరాబాద్, అలంపూర్, కర్నూల్‌కు వెళ్తూ భూత్పూర్ చౌరస్తాలో బ్రిడ్జి కింద యూటర్న్ వద్ద మోటర్ సైకిళ్లను నిలిపి వెళ్తున్నారు. ఉదయం నుంచి మధ్య రాత్రి వరకు పదుల సంఖ్యలో వాహనాలు నిలపడంతో అది పార్కింగ్ స్థలంగా మారింది.

– భూత్పూర్

క్రీడలతో మానసికోల్లాసం

హన్వాడ: క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని ఏఎంసీ చైర్మన్ బెక్కరి అనిత అన్నారు. ఆదివారం మండలంలోని వేపూర్‌లో వారం రోజులుగా కొనసాగిన క్రికెట్ టోర్నీ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వేపర్, మహబూబ్‌నగర్ జట్లు ఫైనల్ మ్యాచ్‌లో తలపడ్డాయి. మహబూబ్‌నగర్ విజేతగా నిలవగా, వేపూర్ రన్నరప్‌గా నిలిచింది. విజేతగా జట్టు కెప్టెన్ డీజె రాజుకు రూ.30వేల నగదుతో పాటు ట్రోఫీ, రన్నరప్ జట్టుకు ఏఎంసీ చైర్మెన్ బెక్కరి అనిత బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు యాదవరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు మహేందర్, బీఆర్ఎస్ నాయకుడు ఖాజయ్యగౌడ్, కోస్గి యాదయ్య, కృష్ణయ్య, భీమయ్య, అచ్చన్న, షరీఫ్, విజయ్‌కుమార్, టోర్నీ నిర్వాహకులు అంబేద్కర్ యువజన సంఘం యువకులు తదితరులు పాల్గొన్నారు.



విజేత మహబూబ్‌నగర్ జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న ఏఎంసీ చైర్మన్ బెక్కరి అనిత

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



రేణుకాఎల్లమ్మ ఆలయంలో మహాయజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

జడ్చర్ల టౌన్: విద్యానగర్ కాలనీలో ఉన్న రేణుకాఎల్లమ్మ ఆలయ 6వ వార్షికోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఆర్యసమాజ భక్తబృందం ఆధ్వర్యంలో లక్ష్మీసూక్తసహిత గాయత్రి మహాయజ్ఞం చేపట్టారు. యజ్ఞంలో జగన్‌గౌడ్, చిన్న వెంకటేశ్‌గౌడ్, వేణుగోపాల్‌గౌడ్, చెన్నయ్య, మల్లిఖార్జున్ కుటుంబ సభ్యులు కూర్చున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు గోనెల రాధాకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం, అలంకరణ చేసి ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పండితుడు ప్రాణేష్‌శర్మ హిందూ సనాతన ధర్మాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ మాతృశక్తిమూర్తి లావణ్య, ధర్మజాగరణ సభ్యుడు రవీంద్రచారి, ఆర్యసమాజ సభ్యులు విజయ్‌కుమార్, కృష్ణయ్య, నర్సింహులు, లవకుమార్‌తోపాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణే లక్ష్యం

- పాదయాత్రికుడు శివచరణ్‌సింగ్
- జడ్చర్లలో ఘన స్వాగతం

జడ్చర్ల టౌన్: సనాతన ధర్మ పరిరక్షణే లక్ష్యమని పాదయాత్రికుడు శివచరణ్‌సింగ్ అన్నారు. ఆదివారం జడ్చర్లలో ఆయనకు ఘనస్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూపీలోని ఫతేపూర్ జిల్లా ఖరోలిలో 2022 మార్చి25న పాదయాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. నేటికి 17రాష్ట్రాల్లో పాదయాత్ర చేస్తూ మొత్తం 20వేల కిలోమీటర్లు పూర్తి చేశామన్నారు. 44వ నంబర్ జాతీయ రహదారి మీదుగా కొనసాగుతున్న పాదయాత్ర జడ్చర్లకు చేరుకోగా అతడికి ఆర్ఎస్ఎస్, హిందూ సంఘాలు ఘనస్వాగతం పలికి ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ నాయకులు జగ్‌పాల్‌రెడ్డి, లావణ్య, రవీంద్రచారి, చిరంజీవులు, పిట్టల నరేష్ పాల్గొన్నారు.



శివచరణ్‌సింగ్‌ను సత్కరిస్తున్న వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ నాయకులు

విజేతలకు బహుమతులు ప్రదానం



కొత్తపల్లిలో విజేతలకు బహుమతులు ప్రదానం నిర్వాహకులు

మిడ్జిల్: ఎంపిఎల్ క్రికెట్ టోర్నీ ఆదివారం ముగియగా గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మిడ్జిల్ జరిగిన కార్యక్రమంలో గౌస్, సంపత్, శ్రీనువాస్‌గౌడ్, శంకర్, జహంగీర్, జోషఫ్. నర్సింహులు గుప్త, నిస్సార్, రాములు పాల్గొన్నారు.

● మండలంలోని కొత్తపల్లి ఎంపీటీసీ పరిధిలోని కొత్తపల్లి, బైరంపల్లి, లింబ్యాతండా, చేద్‌ఘూట్‌తండా పంచాయతీల్లో జరిగిన క్రికెట్ టోర్నీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. విన్నర్‌గా కొత్తపలి, రన్నర్‌గా లింభాతండా నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు పాండు, కాడయ్య, శివప్రసాద్, రమేష్, యాదగిరి, గణేష్ పాల్గొన్నారు.

గురువులకు ఘన సన్మానం



దేవరకద్ర రూరల్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995–96లో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం శ్రీవాణి శిశుమందిర్ పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● కొౌకుంట్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1998–99 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం గురువులను సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం..

అడ్డాకుల: స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో 2002–03కి చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. నాడు వారికి పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు చిన్న శ్రీనివాసులు, పెద్ద శ్రీనివాసులు, సత్యన్న, నీలకంఠం, రాంగోపాల్, వసుంధర, అరుణను ఈ కార్యక్రమానికి ఆహ్వానించి శాలువా పూల మాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో టి.శ్రీనివాసులు, మల్లేష్, విజయ భాస్కర్, సాయికిశోర్, మహేందర్, జానకి, రాములు, దేవుజీ, జగదీష్, షేక్ హుస్సేన్, దేవేంద్ర సాగర్, సురేందర్, అంజనేయులు పాల్గొన్నారు.

అటు వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే

- ఎంపీడీఓ కార్యాలయం పక్కనే మురుగు
- భరించలేని దుర్వాసన
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

రాజాపూర్(బాలానగర్): బాలానగర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వైపుగా వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కార్యాలయం మరుగుదొడ్ల నుంచి వచ్చిన మురుగు నీరు పక్కన పేరుకుపోయింది. దీంతో పరిసరాలు భరించలేని దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఎదురుగా గ్రంథాలయం ఉండగా అక్కడికి వచ్చే పాఠకులు, ఓవర్ హెడ్ ట్యాంక్ వద్దకు వెళ్లేందుకు తాగు నీటి సరఫరా చేసే సిబ్బంది సైతం ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు కింది స్థాయి సిబ్బంది ఆదేశాలు జారీ చేస్తున్నారే తప్ప వాటిని అమలు చేయడం లేదు. ఎంపీడీఓ కార్యాలయ పరిసరాల్లోనే పరిస్థితి ఇలా ఉంటే మిగతా చోట్ల పారిశుద్ధ్యం ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇలా ఉంటే రోగాలు రావా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయ పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



బాలానగర్ ఎంపీడీఓ కార్యాలయం పక్కనే పేరుకుపోయిన మురుగు